క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల కోసం నిలదీత



ఏఈని నిలదీస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: మందమర్రి మండలంలోని చిర్రకుంట, సారంగపల్లి గ్రామ పంచాయతీల పరిధిలో ప్రత్యేకాధికారి (పంచాయతీ రాజ్ ఏఈ) ఇష్టానుసారంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేసారని ఆరోపిస్తూ బుధవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏఈ ఇసాక్‌ని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు నిలదీశారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అర్హులైన వారి జాబితాను ఇవ్వాలని నాయకులు పట్టుబట్టగా తనవద్ద లేదని, ఎంపీడీవోను అడగాలన్నారు. ఎంపీడీవోను అడిగితే ప్రత్యేకాధికారి ఏఈనే అడగాలని అన్నారు. ఒకరిపై ఒకరు దాటవేత దోరణిలో సమాధానం చెబుతున్నారని నాయకులు మండిపడ్డారు. గ్రామాల్లో కాంగ్రెస్ నాయకుల కనుసన్నల్లో మండల అధికారులు పనిచేస్తున్నారని, అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూ మామూళ్లు దండుకుంటున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు విషయంలో అనర్హులకు కేటాయిస్తే ఊరుకునేది లేదని, ఇళ్లు మంజూరు చేసిన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

4న మెగా వైద్య శిబిరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న హాస్పిటల్ సిబ్బంది, ప్రెస్‌క్లబ్ సభ్యులు

శ్రీరాంపూర్: మే 4న నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు రెనే హాస్పిటల్(కరీంనగర్) జనరల్ మేనేజర్ ప్రవీణ్ ప్రసాద్ తెలిపారు. నస్పూర్ కాలనీలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్థోపెడిక్, కార్డియాలజీ, పల్మనాలజీ, జనరల్ మెడిసిన్, జాయింట్ రీప్లేస్మెంట్, న్యూరాలజీ, గైనకాలజీ, యూరాలజీ స్పెషలిస్టులు హాజరై వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి ప్రతినిధులు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు భూపతి రవి, తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో 'మిమ్స్' ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల పట్టణంలోని మిమ్స్ ప్లే అండ్ హైస్కూల్ విద్యార్థులు బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో సత్తా చాటారు. 600మార్కులకు గాను కే.త్వరిత 581, కుశాల్ 580, కే. వర్షిత 580, కే. సాయి గణేశ్ 578, హర్షిత పటేల్ 574, ఆర్. స్నేహిత 574, ఎం. వైష్ణవి 574, ఎం. హర్షిణి 573, పి. హాసిని 561, ఏ. రిశ్విత శ్రీ 558 మార్కులు సాధించి విజయదుందుభి మోగించారు. పాఠశాలలోని విద్యార్థులు అన్ని సబ్జెక్ట్స్‌లలో గ్రేడ్ ఏ1 సాధించారని, అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ టి.శ్రీనివాస్ రాజు, డైరెక్టర్లు పి.ఉపేందర్ రెడ్డి, పి.శ్రీధర్‌రావు, యం. విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ జి.సంగీత, అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

కేజీబీవీల్లో సమ్మర్ క్యాంపులు నిర్వహించాలి



సమీక్ష నిర్వహిస్తున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: కేజీబీవీలో సమ్మర్‌క్యాంపులు విజయవంతంగా నిర్వహించాలని డీఈవో యాదయ్య సూచించారు. బుధవారం స్థానిక డీసీఈబీ కార్యాలయంలో కేజీబీవీ ప్రత్యేక అధికారులతో వేసవి శిబిరాలపై సమీక్షించారు. నస్పూర్ కేజీబీవీలో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరానికి జిల్లాలోని అన్ని కేజీబీవీల విద్యార్థులను పంపించాలని సూచించారు. పెయింటింగ్, డ్యాన్స్, స్పోకెన్ ఇంగ్లిష్, స్పీడ్ మేథమెటిక్స్, కంప్యూటర్ మెలకువలు, ఆటలు, యోగాపై శిక్షణ ఇస్తారని తెలిపారు. సమీక్ష సమావేశంలో సెక్టోరల్ అధికారి యశోధర, చౌదరి, సత్యనారాయణమూర్తి, స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

సత్తాచాటిన సర్కారుబడులు

'పది' పరీక్ష ఫలితాల్లో విద్యార్థుల మెరుగైన ప్రతిభ | అభినందించిన ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు

చెన్నూర్ గురుకులంలో 100శాతం



బి.మేఘన ఐశ్వర్య జాహ్నవి

చెన్నూర్: చెన్నూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన 78మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా 78మంది విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ స్రవంతి తెలిపారు. బి.మేఘన 556మార్కులు, కె.ఐశ్వర్య 549, ఎ.జాహ్నవి 540మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు మిశ్రమ ఫలితాలు సాధించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు మీడియంలో 19మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 15మంది విద్యార్థులు పాసయ్యారు. ఇంగ్లిష్ మీడియంలో 17మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 15మంది ఉత్తీర్ణులయ్యారు. సమత 468, జోత్స్న 469, వర్షిత 469, అక్షయ 460, కస్తూర్బా పాఠశాలకు చెందిన 41మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 39మంది పాసై 95శాతం ఉత్తీర్ణత సాధించారు. కస్తూర్బా పాఠశాలకు చెందిన అంబటి అంజలి 519మార్కులు సాధించింది. జిల్లా పరిషత్ బాల బాలికల పాఠశాల తెలుగు మీడియంకు చెందిన 51మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 42మంది పాసయ్యారు. ఇంగ్లిష్ మీడియంలో 56మంది పరీక్షలు రాయగా 53మంది పాసై 95శాతం ఉత్తీర్ణత సాధించారు. మైనార్టీ గురుకుల పాఠశాల 40మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 38మంది విద్యార్థులు పాసై 95శాతం ఉత్తీర్ణత సాధించారు.

హాజీపూర్‌లో ఫలితాలు మెరుగు



కదార్ల చరణ్ చిందం త్రిలోఖ్య సల్లం లోహిత



గూడ అక్షిత సాగరిక జయశాలిని

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పది పరీక్షా ఫలితాలు బుధవారం వెలువడగా హాజీపూర్ మండలం మెరుగైన ఫలితాలతో గుర్తింపు చాటింది. దొనబండ పాఠశాలలో 100శాతం ఫలితాలతో మెరుగైన ఉత్తీర్ణత సాధించగా కోడి సాయితేజ 515మార్కులు సాధించాడు. రాపల్లి పాఠశాల 94శాతం ఫలితాలతో ఉత్తీర్ణత సాధించగా పుల్ల మౌనిక 481మార్కులు సాధించింది. గఢపూర్ పాఠశాలలో 93శాతం ఫలితాలు రాగా, ఇండ్ల మధుప్రియ 487మార్కులు సాధించింది. ముల్కల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 35మందికి 34మంది ఉత్తీర్ణత కాగా ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు చిప్పకుర్తి సాగరిక 528, జయశాలిని 513, వెన్నెల 512, వర్ష 505మార్కులు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొమ్మ గణపతిరెడ్డి తెలిపారు. సబ్బెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంలో 48మందికి 48మంది ఉత్తీర్ణత సాధించగా తెలుగు మీడియంలో 13మందికి 12మంది ఉత్తీర్ణులయ్యారు. చిందం త్రిలోఖ్య 560మార్కులు, సల్లం లోహిత 551మార్కులు, గూడ అక్షిత 547, అల్లంల సంకీర్తణ 529, అంకం లిఖిత 528, చిందం నేహ 527, దముక సాధ్విక 522, జుమిడి కౌసిక్ 518, కొసరి ఐశ్వర్య 516, ఆకుతోట శృతిక 510మార్కులు సాధించారు. గుడిపేటలోని మహాత్మ జ్యోతిభాపూలే గురుకుల పాఠశాల 100శాతం ఫలితాలు సాధించగా, కోటపల్లి మండలం జనగామ గ్రామానికి చెందిన కదార్ల చరణ్ 570మార్కులతో టాపర్‌గా నిలిచాడు. కర్ణమామిడి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 100శాతం ఫలితాలతో మెరుగైన ఉత్తీర్ణత సాధించగా డి.రిష్వీక 552మార్కులు సాధించింది. విద్యార్థులను ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రులు అభినందించారు.

జన్నారంలో వందశాతం...



యోగేశ్వర్ నరేందర్ శైనిత



సిరివెన్నెల అదిభా సొనాలి

జన్నారం: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జన్నారం మండలం వందశాతం ఉత్తీర్ణత సాధించింది. 582మార్కులతో జిల్లా స్థాయి ర్యాంకు సాధించి కిష్టాపూర్ పాఠశాల సత్తా చాటింది. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 620మందికి గాను 620మంది విద్యార్థులు ఉత్తీర్ణత పొంది వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి విజయ్‌కుమార్ తెలిపారు. కిష్టాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన రాథోడ్ యోగేశ్వర్ 600మార్కులకు గాను 582మార్కులు సాధించి జన్నారం మండలంలో మొదటి స్థానంలో, జిల్లా స్థాయిలో ర్యాంకు సాధించినట్లు, ఎల్పుల నరేందర్ 570మార్కులు పాఠశాల హెచ్ఎం గుండ రాజన్న, ఉపాధ్యాయుడు కమలాకర్ తెలిపారు. రాఘవేంద్ర లిటిల్‌హాస్స్ పాఠశాలకు చెందిన శైనిత 577, సిరివెన్నెల 563మార్కులు సాధించి మండలస్థాయిలో రెండో స్థానంలో నిలువడమే కాకుండా వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్ఎం శ్రీనివాస్ తెలిపారు. స్లేట్ హైస్కూల్‌కు చెందిన అదిభా 574, సొనాలి 574మార్కులు సాధించినట్లు హెచ్ఎం ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఎంఈవో విజయ్‌కుమార్ అభినందించారు.

తాండూర్‌లో 97శాతం...



హర్ష వర్ధన్ లక్ష్మణ్‌రావు పూజిత

తాండూర్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తాండూర్ మండల విద్యార్థులు 97శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలం నుంచి మొత్తం 394మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 384మంది విద్యార్థులు పాసయ్యారు. తంగళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్, జిల్లా పరిషత్ హైస్కూల్(ఉర్దూ మీడియం), మహాత్మా జ్యోతిభాపూలే పాఠశాల, కస్తూర్బా బాలికల విద్యాలయం, విద్యాభారతి హైస్కూల్, సేయింట్ థెరిస్సా హైస్కూల్ విద్యార్థులు పదో తరగతిలో వందశాతం ఫలితాలు సాధించారు. జ్యోతిభాపూలే గురుకుల పాఠశాల విద్యార్థి చాటే హర్షవర్ధన్ 583మార్కులతో మండల టాపర్‌గా నిలవగా, విద్యాభారతికి చెందిన జి.లక్ష్మణ్‌రావు 568మార్కులు, అచ్చులాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పూజిత 567మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నారు. ఎంఈవో మల్లేశం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

భీమారంలో 96శాతం...



శ్రీధర్ కృపారాణి

భీమారం: మండలంలో పదో తరగతి పరీక్షల్లో 96శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో వేణుగోపాల్ తెలిపారు. భీమారం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి శ్రీధర్ 534, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలకు చెందిన కృపారాణి 528మార్కులు సాధించినట్లు ఎంఈవో తెలిపారు. మొత్తం 131మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా నలుగురు విద్యార్థులు ఫెయిలయినట్లు తెలిపారు.

భీమినిలో శతశాతం...



డి. సంకీర్తన కే. నందిని

భీమిని: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో భీమిని, కన్నెపల్లి కేజీబీవీ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. భీమిని మండలంలో కేజీబీవీ పాఠశాల విద్యార్థిని కే.నందిని 506 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. రెండో స్థానంలో భీమిని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని కే.సుశ్మిత 503 మార్కులతో రెండో స్థానంలో నిలిచింది. కన్నెపల్లి కేజీబీవీ విద్యార్థిని దుగుట సంకీర్తన 525మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలువగా, కన్నెపల్లి జిల్లా పరిషత్ పాఠశాల గురుండ్ల అనూష 520మార్కులతో రెండో స్థానంలో నిలిచింది.

కోటపల్లిలో 97.54శాతం..



పూరెళ్ల అంజలి ఆశ్విత్

కోటపల్లి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో కోటపల్లి మండల విద్యార్థులు 97.54శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కోటపల్లి మోడల్ స్కూల్లో 84మంది విద్యార్థులకు గాను 84మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా, మండల టాపర్లుగా మోడల్ స్కూల్ విద్యార్థులు పూరెళ్ల అంజలి(568), రెండో స్థానంలో ఆశ్విత్(545) మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. కోటపల్లి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో 35మంది విద్యార్థులకు గాను 35మంది విద్యార్థులతో 100శాతం ఉత్తీర్ణత సాధించగా, సిర్సా జెడ్పీహెచ్ఎస్‌లో 24మంది విద్యార్థులకు 24మంది, పార్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో 20మంది విద్యార్థులకు గాను 20మంది, మల్లంపేట జెడ్పీహెచ్ఎస్‌లో ముగ్గురు విద్యార్థులను గాను ముగ్గురు ఉత్తీర్ణత సాధించి వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. కోటపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో 17మంది విద్యార్థులకు 16మంది ఉత్తీర్ణులు కాగా, అన్నారం జెడ్పీహెచ్ఎస్‌లో 8మందికి గాను ఏడుగురు ఉత్తీర్ణత, నక్కలపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఐదుగురు విద్యార్థులకు ముగ్గురు ఉత్తీర్ణత, దేవులవాడ జెడ్పీహెచ్ఎస్‌లో 41మందికి 40మంది ఉత్తీర్ణత, ఆశ్రమ పాఠశాలలో 47మందికి 45మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అంజలి, ఆశ్విత్‌ను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజశేఖర్, సిబ్బంది అభినందించారు.

నస్పూర్ కేజీబీవీలో 100శాతం

నస్పూర్: నస్పూర్ పట్టణంలోని కేజీబీవీ విద్యార్థులు 'పది'లో 100శాతం ఉత్తీర్ణులైనట్లు ఎస్‌వో మౌనిక బుధవారం తెలిపారు. మొత్తం 44మంది హాజరు కాగా 44మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని, బి.అక్షర 537మార్కులు సాధించినట్లు తెలిపారు. తీగల్‌పహాడ్ జెడ్పీహెచ్ఎస్‌లో ఇంగ్లిష్ మీడియంలో 39మందికి గాను 38మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ప్రసన్నకుమార్ 544మార్కులు సాధించగా తెలుగు మీడియంలో 15మందికి 13మంది ఉత్తీర్ణులు అయినట్లు హెచ్ఎం రామన్న తెలిపారు. విలేజ్ నస్పూర్ జెడ్పీహెచ్ఎస్‌లో 34మందికి 32మంది, సీతారాంపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో 15మందికి 13మంది ఉత్తీర్ణులైనట్లు హెచ్ఎంలు ధామోదర్, పద్మజ తెలిపారు.

జైపూర్‌లో 99.13శాతం...

జైపూర్: మండల వ్యాప్తంగా పది ఫలితాల్లో 99.13శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతో పాటు ఒక్క కస్తూర్బాగాంధీ, జైపూర్, కోటపల్లి గురులాలతో కలిపి మొత్తం 348విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా ముగ్గురు విద్యార్థులు ఫెయిల్ కాగా, 345మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కోటపల్లి గురుకులానికి చెందిన ఏ.రంజిత్ 537మార్కులతో మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించగా ఇదే గురుకులంలో చదువుతున్న ఆర్.అరవింద్ 534మార్కులతో రెండో స్థానంలో నిలిచాడు.

వేమనపల్లి టాపర్‌గా అంజన్న

వేమనపల్లి: మండలంలోని వేమనపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల, నీల్వాయి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల, నీల్వాయి కేజీబీవీ వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. వేమనపల్లి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల 98శాతం ఉత్తీర్ణత సాధించగా ఏహెచ్ఎస్ పాఠశాలకు చెందిన కామెర అంజన్న 539మార్కులతో మండల టాపర్‌గా నిలిచారు. జెడ్పీహెచ్ఎస్ నీల్వాయికి చెందిన చెవ్వ సాకేత్ 529మార్కులు, కేజీబీవీ నీల్వాయికి చెందిన నికాడి అంజలి 527మార్కులు, వేమనపల్లి జెడ్పీహెచ్ఎస్ చెందిన కుర్సింగ సౌమ్య 526మార్కులు సాధించినట్లు ఎంఈవో శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

దండేపల్లిలో వెల్గనూర్ టాపర్



మ్యాన అక్షయ శ్రీవైష్ణవి దీక్షిత

దండేపల్లి: పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో దండేపల్లి మండలంలో 9 జెడ్పీ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీతో పాటు మోడల్ స్కూళ్లలో మండలంలోని వెల్గనూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల టాపర్లుగా నిలిచారు. మొత్తం 44మందిలో 43మంది పాసయ్యారు. 500కు పైగా ఏడు మంది విద్యార్థులు మార్కులు సాధించారు. పాఠశాలకు చెందిన మ్యాన అక్షయ 571, కొంతం శ్రీవైష్ణవి 551, దీక్షిత 545మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచారు. మండలంలోని లింగాపూర్ మోడల్‌స్కూల్‌కు చెందిన సాయిచరణ్ 546, మామిడిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పత్తిపాక అభిజ్ఞ 540మార్కులు సాధించింది. పదోతరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు.

మందమర్రిలో 96.17శాతం...

మందమర్రిరూరల్: మందమర్రి మండలంలో 96.17శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ, ప్రైవేట్, రెసిడెన్సియల్ పాఠశాలల నుంచి 913మంది పరీక్షలు రాయగా 878మంది ఉత్తీర్ణులయ్యారు. మహాత్మాజ్యోతిభా పూలే రెసిడెన్సియల్ స్కూల్ విద్యార్థిని భార్గవికి 571మార్కులు, మోడల్ స్కూల్ విద్యార్థిని సిరి 566, టీఎస్‌డబ్ల్యూఎస్(బాలికల) పాఠశాల విద్యార్థిని సాత్విక 560, జెడ్పీహెచ్ఎస్ పొన్నారం విద్యార్థిని కొంట్రంగి సాయిప్రియ 540, కేజీబీవీ విద్యార్థిని ఫయిజా 535మార్కులు సాధించారు.

'సీవోఈ'లో విజయదుందుభి



ఆశ్రిత్‌రామ్ రామ్‌చరణ్ అరుణ్‌సందేశ్

బెల్లంపల్లి: బెల్లంపల్లి సీవోఈ పాఠశాల విద్యార్థులు పది ఫలితాల్లో విజయదుందుభి మోగించారు. 73మంది పరీక్షలు రాసి వందశాతం ఉత్తీర్ణత సాధించారు. 9మంది విద్యార్థులు 540పైచిలుకు మార్కులు సాధించగా, 32మంది 500వరకు మార్కులు తెచ్చుకున్నారు. జుమ్మిడి ఆశ్రిత్ రామ్ 581మార్కులతో బెల్లంపల్లి మండల టాపర్‌గా నిలిచి ప్రత్యేకతను చాటుకున్నాడు. ఎ.రామ్‌చరణ్ 563మార్కులు తెచ్చుకొని సీవోఈ పాఠశాల టాపర్‌గా నిలవగా, కొండగొర్ల అరుణ్‌సందేశ్ 559మార్కులు, ఎస్.కిషన్ 553మార్కులు, బండి మనోజ్‌కుమార్ 552మార్కులు సాధించి సీవోఈకి వన్నె తెచ్చారు.

చెన్నూర్‌లో వంద శాతం...

చెన్నూర్‌రూరల్: పదో తరగతి పరీక్షల్లో మండలంలోని సుద్దాలలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థి కె.ప్రదీప్ 532, పొక్కూరు గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థి బొడ్డు ఐశ్వర్య 516, కిష్టంపేట జెడ్పీఎస్ఎస్ పాఠశాల విద్యార్థి చల్ల మనీష 509మార్కులు సాధించారు. ఇందులో పొక్కూరు, కొమ్మెర, కిష్టంపేట గ్రామాల్లోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలు వంద శాతం ఫలితాలు సాధించినట్లు ఎంఈవో రాధాకృష్ణమూర్తి, ఆయా పాఠశాలల హెచ్ఎంలు తెలిపారు.

లక్సెట్టిపేట టాపర్ మహతి

లక్సెట్టిపేట: పది ఫలితాల్లో మండల కేంద్రంలోని గుడ్ షెపర్డ్ పాఠశాలకు చెందిన బందారి మహతి 570మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. గురుకుల పాఠశాలకు చెందిన బదావత్ దీపిక 555మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలలో ప్రథమ స్థానాన్ని పొందింది. అధ్యాపకులు, తల్లిదండ్రులు శుభాకాంక్షలు తెలిపారు.

నెన్నెలలో 95శాతం...

నెన్నెల: మండలంలోని ఐదు జిల్లా పరిషత్ పాఠశాలలు, ఒక కస్తూరిబా, గిరిజన ఆశ్రమ పాఠశాల నుంచి మొత్తం 190మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా 180మంది పాస్ కాగా 10మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. మండలంలో 95శాతం పదో తరగతి ఫలితాలు వచ్చినట్లు కుశ్నపల్లి ఉన్నత పాఠశాలలో 100కు 100శాతం ఫలితాలు వచ్చాయని ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

శ్రీరాంపూర్‌లో 92 శాతం బొగ్గు ఉత్పత్తి



వివరాలు వెల్లడిస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: నూతన ఆర్థిక సంవత్సరం మొదటి నెలలో 92శాతం ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించినట్లు శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్ తెలిపారు. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం ఆయన బొగ్గు ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. ఏప్రిల్ నెలలో 5.53లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి గాను 5.11టన్నుల ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలో గత నెల 19మందికి కారుణ్య ఉద్యోగాలు కల్పించామని, ఇప్పటికి 3803మందికి కారుణ్య ఉద్యోగాలు కల్పించామన్నారు. నీటి బిందువు జల సింధువు కార్యక్రమంలో భాగంగా శ్రీరాంపూర్ ఏరియాలో 5 కొత్త చెరువులు, రెండు పాత చెరువుల పునరుద్ధణ చేస్తున్నామన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో సీసీసీలోని సింగరేణి పాఠశాలలో ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్, పాలిటెక్నిక్ కోచింగ్ ఇస్తున్నామన్నారు. ప్రగతి, ప్రాణహిత మైదానాల్లో, నస్పూర్ కాలనీ సేవాభవన్ వద్ద వేసవి క్రీడా శిబిరం ఏర్పాటు చేయించామన్నారు. తాగునీటి ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఐఈడీ ఎస్ఈ కిరణ్‌కుమార్, సీనియర్ పీఓ కాంతారావులు పాల్గొన్నారు.

మందమర్రి ఏరియాలో 70శాతం...

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో ఏప్రిల్ మాసంలో 70శాతం బొగ్గు ఉత్పత్తి జరిగినట్లు ఏరియా జీఎం దేవేందర్ తెలిపారు. జీఎం ఆఫీస్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం ఉత్పత్తికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఏరియాలో బొగ్గు ఉత్పత్తి పెంచడానికి ప్రతి కార్మికుడు సహకరించాలని, గైర్హాజర్ కార్మికులు విధుల్లో చేరి బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనలో భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో ఎస్వోటు జీఎం విజయ్‌ప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్, ఐఈడీ రాజన్న ఏరియా ఇంజనీర్ (ఈఅండ్ఎం) వెంకటరమణ, డీవైపీఎం మైత్రేయబంధు ఉన్నారు.

ఈజీఎస్ ఉద్యోగుల పెన్‌డౌన్

చెన్నూర్‌రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు రావడం లేదని బుధవారం ఈజీఎస్ ఉద్యోగులు పెన్‌డౌన్ చేస్తున్నట్లు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. మే 3వ తేదీ వరకు పెన్‌డౌన్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అప్పటికీ వేతనాలు ఇవ్వకుంటే నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో గంగాభవాణి, ఈసీ చంద్రశేఖర్, సీఓలు సతీష్, రాజేందర్, టీఏలు వెంకటేశ్, రవీందర్, రవి పాల్గొన్నారు.

సేఫ్టీ అధికారికి వీడ్కోలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా రక్షణ అధికారిగా పనిచేసి రిటైర్డ్ అయిన ఏ. శ్రీధర్‌రావును ఏరియా అధికారులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్, ఇతర అధికారులు శ్రీధర్‌రావు దంపతులను శాలువాతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. రిటైర్మెంట్ అనంతరం శేష జీవితాన్ని సుఖసంతోషాలతో గడుపాలన్నారు.

సేఫ్టీ జీఎంకు వీడ్కోలు

శ్రీరాంపూర్: రామగుండం రీజియన్ సేఫ్టీ జనరల్ మేనేజర్‌గా పనిచేసి రిటైర్డ్ అయిన కేహెచ్ గుప్తాను ఏరియా అధికారులు సన్మానించి వీడ్కోలు పలికారు. జీఎం కార్యాలయంలో బుధవారం జీఎం శ్రీనివాస్ ఆయన్ను శాలువాతో సత్కరించి ఏరియాలో చేసిన సేవలను కొనియాడారు.

దుఃఖంలో రాసి.. ఫలితంలో మెరిసి



మంచర్ల శ్రీలత

భీమిని: కన్నెపల్లి మండలంలోని ముత్తాపూర్ గ్రామానికి చెందిన మంచర్ల శ్రీలత తండ్రి పదో తరగతి పరీక్ష ప్రారంభం రోజున మృతి చెందాడు. ఓ వైపు తండ్రి మరణం.. మరో వైపు కీలకమైన పదో తరగతి పరీక్షలు. అయినప్పటికీ ఆమె తన దుఃఖాన్ని దిగమింగుతూ పరీక్షలకు హాజరై, ఉత్తీర్ణత సాధించింది. పేదరికంలో ఉన్న శ్రీలత ఉన్నత చదువులకు దాతలు ముందుకొచ్చి సహకరించాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

గుర్తింపు సంఘం నాయకులతో సమావేశం



సమస్యలు తెలుసుకుంటున్న జీఎం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో గల కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం గుర్తింపు కార్మిక (ఏఐటీయూసీ) సంఘం ప్రతినిధులతో నిర్మాణాత్మక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యూనియన్ ప్రతినిదులు ఏరియాలోని పలు సమస్యలు జీఎం దేవేందర్ దృష్టికి తీసుకొచ్చారు. జీఎం మాట్లాడుతూ.. తన పరిధిలోని సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని, తన పరిధిలో లేని వాటిని కార్పొరేట్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. సమావేశంలో మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సత్యనారామణ, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి మల్లేష్, ఏరియాలోని వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మే డే గొప్పతనం నూతన ఉద్యోగులకు తెలపండి

మందమర్రిరూరల్: ప్రపంచ కార్మిక దినోత్సవమైన మే డే ఉత్సవాలను సింగరేణిలో ఘనంగా జరుపుకోవాలని, నూతన ఉద్యోగులకు మే డే గొప్పతనం గురించి వివరంగా తెలపాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఏఐటీయూసీ ఆఫీస్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను రూపొందించి అమల్లోకి తీసుకొచ్చి, కార్మిక వర్గానికి అన్యాయం చేస్తుందని ఆరోపించారు. 44చట్టాలను నాలుగు చట్టాల కిందకు తీసుకురావడాన్ని కార్మిక వర్గం వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఆ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సుదర్శన్, శ్రీనివాస్, బానయ్య, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.